ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
ఆదివారం 11 ఫిబ్రవరి 2024

దమ్.. మారో దమ్..



- గంజాయి మత్తులో యువత చిత్తు
- మారుమూల ప్రాంతానికి పాకిన గంజాయి అమ్మకాలు
- ఉత్తరాంధ్ర టు సండ్రడివి వయా కర్ణాటక
- ములకలచెరువు, బి.కొత్తకోట, పీటీఎం, కురబలకోటల్లో జోరుగా అమ్మకాలు

ములకలచెరువు, ఫిబ్రవరి 10: మారుమూల ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గానికి గంజాయి మరక అంటింది. ఈ ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రానికి జోరుగా గంజాయి అక్రమ రవాణా జరగడంతో పాటు ఇక్కడ గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం పోలీసులు ఇటీవల వంద కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసి రెండు కార్లను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఉత్తరాంధ్రతో పాటు ఒరిస్సా సరిహద్దుల నుంచి స్మగ్లర్లు గంజాయిని ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సండ్రడివికి తీసుకొస్తున్నారు. జనసంచారం, వాహనాల రాకపోకలు అంతంతమాత్రంగా ఉండే సండ్రడివిని కేంద్రంగా చేసుకుని బి.కొత్తకోటతో పాటు కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నారు. రిజర్వు ఫారెస్టైన సండ్రడివిని స్మగ్లర్లు గంజాయి పాయింట్‌గా పెట్టుకున్నారు. ఇక్కడ గంజాయి ప్యాకెట్లు ఇతర వాహనాల్లోకి అక్రమంగా రవాణా చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా చాలా రోజులుగా స్మగ్లర్లు ఈ తతంగాన్ని నడుపుతున్నారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై పోలీసుల విచారణలో పలు విషయాలు బయటపడినట్లు సమాచారం. తంబళ్లపల్లె నియోజకవర్గమైన ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాల్లో జోరుగా గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసుల విచారణ వెల్లడైనట్లు తెలిసింది. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న గంజాయి అమ్మకాలపై కూడా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఎక్కడెక్కడ అమ్మకాలు జరుగుతున్నాయో సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా యువత గంజాయి బారిన పడుతున్నారు. మారుమూల ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గంలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరుగుతుండడం కలవరపెడుతోంది. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలను అరికట్టకుంటే మరింత విస్తరణ చెంది జీవితాలు నాశనం అవడంతో పాటు నేరాల సంఖ్య పెరిగే ప్రమాదం లేకపోలేదు.



భారీ ఎత్తున పట్టుబడ్డ గంజాయి (ఫైల్)

అనంతపురంలో పట్టుబడితే..


ములకలచెరువుతో లింకు..

అనంతపురంలో పట్టుబడ్డ గంజాయికి ములకలచెరువుతో లింకు ఏర్పడింది. గత ఏడాది జూన్ నెలలో అనంతపురం నగరానికి చెందిన యువకులు అనంతపురం జిల్లా రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న ఇన్నోవా వాహనంలో వెళుతూ నానా హంగామా సృష్టించారు. దీంతో అప్పట్లో సంచలనం రేగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అనంతపురం నగరానికి చెందిన యువకులను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై అప్పటి శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ విచారణ చేపట్టారు. అనంతపురం యువకులు ములకలచెరువుకు వచ్చి ఇక్కడ వంద గ్రాముల గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ విషయాన్ని అప్పట్లో ఎస్పీ అక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. అప్పట్లో ఈ విషయం ములకలచెరువులో పెద్ద చర్చనీయాంశమైంది. తాజాగా మళ్లీ ఇప్పుడు భారీగా గంజాయి పట్టుబడడంతో ఈ ప్రాంతంలో గంజాయి రవాణా, అమ్మకాలు మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతున్నట్లు వెల్లడవుతోంది.

కర్ణాటక పోలీసుల ఆరా..?

ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సండ్రడివిలో భారీగా గంజాయి పట్టుబడడం, నిందితులను అరెస్టు చేయడంపై బెంగళూరు పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. గంజాయి ఇక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పలు పట్టణాలకు, బెంగళూరు సిటీకి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ఈ విషయంపై బెంగళూరు పోలీసులు దృష్టి సారించినట్లు తెలిసింది. ఎక్కడెక్కడ నుంచి గంజాయి కర్ణాటక రాష్ట్రానికి వస్తుందో తెలుసుకునే పనిలో పడ్డారు. గంజాయి అక్రమంగా తమ రాష్ట్రానికి రాకుండా రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో కర్ణాటక పోలీసులు నిఘా పటిష్టం చేశారు.

అధికార పార్టీ అండదండలతోనే..



అధికార పార్టీ నేతల అండదండలతోనే గంజాయి అక్రమ రవాణా చేస్తూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో అమ్మకాలు చేస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గంజాయితో పాటు కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. వీటి బారినపడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి గంజాయిని, కర్ణాటక మద్యాన్ని అరికట్టాలి. ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులో భారీగా పట్టుబడ్డ గంజాయి వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టాలి. ఎవరి అండదండలు ఉన్నాయో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంలో ఉన్న వారందరిపై కేసులు నమోదు చేయాలి.

- జి.శంకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే, తంబళ్లపల్లె నియోజకవర్గం

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం..



గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం. ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సండ్రడివిలో పట్టుబడ్డ గంజాయి వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. సండ్రడివి అటవీ ప్రాంతంలో తరచూ తనిఖీలు చేస్తున్నాం. ముఖ్యంగా రైల్వేస్టేషన్, బస్టాండుల్లో నిఘా పటిష్టం చేశాం. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. కర్ణాటక సరిహద్దు గ్రామాలపై నిఘా పెట్టాం. గంజాయి అక్రమ రవాణా అమ్మకాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాం.

- రామ్మోహన్, ఎస్‌ఈబీ సీఐ, ములకలచెరువు సర్కిల్

బదిలీలపై నిషేధం సడలింపు

- రేషనలైజేషన్ ప్రక్రియతో ఖాళీల్లో సర్దుబాట్లు
- సచివాలయ ఉద్యోగుల సంఖ్య 11 నుంచి 8కి కుదింపు

కలికిరి, ఫిబ్రవరి 10: సచివాలయాల్లోని ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని చాలా రోజులుగా ప్రభుత్వం చెబుతూ వస్తున్న విషయం చివరకు మరుగున పడింది. సచివాలయాల్లోని ఖాళీలను రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఇతర సచివాలయాల నుంచి బదిలీ చేసి సర్దుబాటు చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ సచివాలయాల్లో 11, వార్డు సచివాలయాల్లో 10 పోస్టుల వంతున శాఖల వారీగా కేటాయించిన విషయం తెలిసిందే. సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డ నాటి నుంచి ఈ పోస్టుల సంఖ్య ఇలాగే కొనసాగుతోంది. గత ఏడాది మే నెలలో మొదటిసారిగా సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అనుమతించింది. బదిలీల అనంతరం చాలా సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయింది. కొన్ని సచివాలయాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. దీంతో పోస్టుల భర్తీ ద్వారా సరిదిద్దడానికి ప్రయత్నిస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి తాజాగా రేషనలైజేషన్ ప్రక్రియను తెరమీదకు తెచ్చింది. దీనికోసం బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ శుక్రవారం జీవో నెం.1 విడుదల చేశారు. పోస్టుల సర్దుబాటుకు అనుసరించాల్సిన కసరత్తు గురించి ఈ జీవో ద్వారానే మార్గదర్శకాలు కూడా జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో కేవలం 8 పోస్టులు మాత్రమే ఉండే విధంగా ఈ సర్దుబాట్లు చేయాలని ఆదేశించారు. కొత్తగా నియామకాలు చేపట్టి పోస్టులు భర్తీ చేసేంత వరకూ 8 పోస్టులతోనే సరిపెట్టాలని కూడా స్పష్టం చేశారు. దీనికి మించి ఉద్యోగులున్న సచివాలయాల నుంచి అదనపు ఉద్యోగులను ఇతర సచివాలయాల్లోని ఖాళీ స్థానాలకు బదిలీ చేయాలని ఆదేశించారు. ఈ సర్దుబాటులో ప్రాధాన్యతాపరంగా జూనియర్ ఉద్యోగులకు స్థాన చలనం కలగనుంది. అంతేగాకుండా బదిలీల్లో కూడా మొదటి ప్రాధాన్యతగా గ్రామ సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు (ఎంఎస్‌కే), డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయనున్నారు. ఇక వార్డు సచివాలయాల నుంచి వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలను బదిలీ చేయనున్నారు. అయితే వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ అసిస్టెంట్లు, పశు, మత్స్య సహాయకులు, ఏఎన్‌ఎం/వార్డు హెల్త్ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్లను మాత్రం ఈ సర్దుబాటు బదిలీల నుంచి మినహాయించారు. ఈ సర్దుబాటు బదిలీలకు అనువుగా ప్రస్తుతం బదిలీలపై ఉన్న నిషేధాన్ని కూడా సడలించారు. ఈ మేరకు రాష్ట్ర వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ జీవో జారీ చేశారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

- ధ్వజారోహణంతో ప్రారంభం



పల్లకీ ఉత్సవ సేవలో స్వామివారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 10: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా స్వామి వారి సన్నిధిలో ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. శనివారం వేకువజామునే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం 10:35 గంటల నుంచి 11:30 గంటల మధ్యలో మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణల నడుమ వేదపండితుల మంత్రోచ్చారణలతో ధ్వజారోహణ ఘట్టాన్ని ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 10:30 నుంచి 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకుని ఉత్సవ సేవలు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు శేషవాహన సేవ, రాత్రి 8 గంటలకు హంసవాహన సేవ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం పైకి ధ్వజపటాన్ని ఎగురవేస్తున్న టీటీడీ వేద పండితులు

జగన్ అరాచకాలను అంతం చేసేందుకే 'శంఖారావం'

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులతో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రిగా జగన్ సాగిస్తున్న అరాచకపాలనను అంతమొందించేందుకే నారా లోకేశ్ 'శంఖారావం' కార్యక్రమం చేపట్టినట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. కలికిరిలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు, యువత, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద, మధ్య తరగతి కుటుంబాలు అలమటిస్తున్న ప్రస్తుత తరుణంలో వారికి భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు లోకేశ్ శంఖారావం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపే లక్ష్యంగా ఈనెల 11నుంచి సుమారు 120నియోజకవర్గాల్లో ప్రతిరోజూ మూడు నియోజకవర్గాల చొప్పున పర్యటిస్తారని వివరించారు. టీడీపీ ఇప్పటికే ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఆయన ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తారన్నారు.

కిశోర్‌ను కలిసిన పీలేరు మెకానిక్‌లు

పీలేరు పట్టణానికి చెందిన టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులు శనివారం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని కలిసి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ జగన్ పాలనలో సమాజంలోని ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

తమ ప్రభుత్వం వచ్చిన తరువాత టూ వీలర్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీలేరుకు చెందిన టీడీపీ నేత దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా శివప్రకాశ్‌రెడ్డి



బాధ్యతలు చేపడుతున్న శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 10: జిల్లా విద్యాశాఖాధికారిగా శివప్రకాశ్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లా గూడూరు ఉప విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీపై అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు. ఈ మేర కు ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా విద్యాశాఖ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘం నాయకులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈవో శివప్రకాశ్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని, అందుకు సిబ్బంది, సంఘ నాయకులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మాధవరంపల్లె సమీపంలో బాహుదా నదిలో ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఇసుక



బాహుదా నదిలో ఇసుక తవ్వకాలు



బాహుదా నది గుల్ల..

- ఎక్స్‌కవేటర్లతో ఇసుక లోడేస్తున్నారు
- టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
- ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డే లేదు..
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



వాల్మీకిపురం మీదుగా టిప్పర్‌లో తరలిపోతున్న ఇసుక

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10: బాహుదా నదిని ఇసుక అక్రమార్కులు గుల్ల చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో నదిలోని ఇసుకను లోడేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకున్నా అధికార పార్టీ నాయకుల అండదండలతో కొందరు అక్రమార్కులు ఇసుకను అమ్మేసి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా బాహుదా నదిని ఇసుక తవ్వకాలతో గుల్ల చేస్తున్నారని గ్రామస్తులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు కూడా శూన్యమని ఆరోపిస్తున్నారు. మండలంలోని మేడికుర్తి ప్రాంతంలోని బాహుదా నదిలో ఇసుకను తోడేసి అక్రమ డంపింగ్ చేయడం, రాత్రి సమయాలలో బయటి ప్రాంతాలకు అక్రమ మార్గంలో టిప్పర్లు, ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. ఇసుక మాఫియా ఎవరికి ఇవ్వాల్సిన మామూళ్లు వారికి ఇచ్చి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మండలంలోని పలు ప్రాంతాలలో బాహుదా నదిలో భారీ అగాథాలు ఏర్పడి ప్రమాద ఘంటికలను తలపిస్తున్నాయి. మంచూరు, మాధవరంపల్లె తదితర గ్రామాలలో అయితే ఎవరు దౌర్జన్యం చేస్తే ఇసుక వారిదే అన్న చందంగా పరిస్థితులు నెలకొన్నాయన్న విమర్శలు ఉన్నాయి. వాల్మీకిపురం, సమీప మండలాలలో ఎక్కడ ఇసుక రీచ్‌లకు, రవాణాకు అనుమతులు లేకపోయినా నిత్యం వందలాదిగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక బయటి ప్రాంతాలకు తరలిపోతుండటం గమనార్హం. ఇసుక అక్రమ రవాణా పట్ల ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజలు కోరుతున్నారు. బాహుదా నదిలో ఇసుక తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోకుంటే రాబోవు రోజుల్లో వ్యవసాయానికి కూడా గడ్డుకాలం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు..

వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం వాహనాల తనిఖీలలో ఇసుక తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. ఇక్కడ రీచ్‌లకు ఎలాంటి అనుమతులు లేవు. బాహుదా నదిలో ఇసుక తవ్వకాలు జరిపినా, బయటి ప్రాంతాలకు తరలించిన చట్టరీత్యా కేసులు నమోదు చేస్తాము. గ్రామీణ ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా పట్ల ప్రజలు కూడా సహకరించి సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

- సునంద, సీఐ, ఎస్‌ఈబీ, వాల్మీకిపురం



వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లెలో ఇసుక అక్రమ డంపింగ్



కూరపర్తి వద్ద బాహుదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

ఇన్‌స్పైర్ మనాక్‌ను విజయవంతం చేయండి

- పోస్టర్లను ఆవిష్కరించిన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సైన్స్ ఎగ్జిబిషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10: పట్టణంలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 12వ తేదీ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టు ప్రదర్శన జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన అడిషనల్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రంజిత్‌నాయుడు, హబీబ్‌లతో కలిసి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టు ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో దేశవ్యాప్తంగా ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. జిల్లా నుంచి ఎంపికైన 245 ప్రాజెక్టులను ఈ పోటీల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆయన తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులంతా తమ ప్రాజెక్టులను జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ పోటీల నుంచి ఎవరికీ మినహాయింపు లేదని ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ మృతి



విజేస్ (ఫైల్)

నందలూరు, ఫిబ్రవరి 10: నందలూరు రైల్వేస్టేషన్‌లో ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) హెడ్‌కానిస్టేబుల్ కె.విజేస్ (41) ప్రమాదవశాత్తు రైలుకింద పడి మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల కథనం మేరకు... కేరళ రాష్ట్రానికి చెందిన కె.విజేస్ కలికిరిలోని ఐటీబీపీ 53వ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు. శెలవుపై సొంతూరు వెళ్లిన ఆయన తిరిగి విధులకు హాజరయ్యేందుకు కన్యాకుమారి నుంచి పూణే వెళుతున్న జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ (16382) రైలులో పాల్ఘాట్ నుంచి తిరుపతికి బీ1 ఏసీ కోచ్ 53 బెర్త్‌లో బయలుదేరారు. తిరుపతిలో ఆయన దిగాల్సి ఉండగా రైలు తిరుపతికి చేరుకున్న సమయానికి ఆయన నిద్రపోయారు. నందలూరులో ఆ ట్రైన్‌కు స్టాపింగ్ లేదు. అయినా రైల్వే ఉద్యోగుల అవసరం నిమిత్తం కొద్దిసేపు మెయిన్ లైన్‌లో ఆగి తిరిగి బయలుదేరింది. ఆ సమయంలో విజేస్ ఇక్కడ దిగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు రైలుకింద పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఐటీబీపీ అడిషనల్ ఎస్పీ అశ్విన్, ఇన్‌స్పెక్టర్ వైవీ రెడ్డి, ఏఎస్‌ఐ పరంజీత్ యాదవ్, సెక్యూరిటీ ఫోర్స్ బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

కారు బోల్తా : వైద్య విద్యార్థి మృతి


లిఖిత్‌కుమార్‌రెడ్డి మృతదేహం - బోల్తాపడిన కారు

ఒంటిమిట్ట/తవణంపల్లె, ఫిబ్రవరి 10: కారు బోల్తా పడటంతో ఓ వైద్య విద్యార్థి మృతి చెందాడు. ఏఎస్‌ఐ రాజేంద్ర తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన ఆకేపాటి శివారెడ్డి, లతల చిన్న కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి (22) చిత్తూరులోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అదే కాలేజీలో చదువుకునే స్నేహితులు పులి భరత్‌గణేష్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, త్రిలోక్, మల్లా శశికుమార్‌లతో కలిసి శుక్రవారం రాత్రి ఐరాల మండలంలోని రిసార్టుకు కారులో వెళ్లాడు. శనివారం వేకువజామున తిరిగి చిత్తూరు వస్తుండగా తవణంపల్లె మండలంలోని నత్తారు బావి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. లిఖిత్‌కుమార్‌రెడ్డి తలకు బలమైన గాయాలవగా, మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం లిఖిత్‌కుమార్‌రెడ్డిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న త్రిలోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పశువుల మేత మీద పడి మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కొండాపురం , ఫిబ్రవరి 10 : మండలంలోని దత్తాపురం గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు పశువుల మేత ఉల్లిపడి కొండల శ్రావణి కుమారి (34) అనే మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... శ్రావణికుమారి పశువుల మేత కోసం గడ్డివామిలోని శనగ పొట్టు మేత తీస్తుండగా ఒక్కసారిగా మేత ఉల్లిపడింది. శనగపొట్టు అంతా తన మీద పడటంతో ఊపిరాడక మృతిచెందింది. భర్త లక్ష్మీ నారాయణరెడ్డి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

దేవునికడప చెరువులో బాలుడు మృతి


మహ్మద్

కడప (క్రైం), ఫిబ్రవరి 10 : స్నేహితులతో పాటు దేవునికడప చెరువులో ఈతకు వెళ్లిన మహ్మద్ (12) అనే బాలుడు శనివారం మృతి చెందాడు. ఖలీల్‌నగర్‌కు చెందిన మహబూబ్, ఆయేషాలకు నలుగురు సంతానం. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతానంలో చివరివాడైన మహ్మద్ శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి దేవునికడప చెరువులోకి ఈతకు వెళ్లాడు. చెరువులోకి దిగి ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న చిన్నచౌకు పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని వెతకగా రాత్రి 7 గంటలకు మృతదేహం లభ్యమైంది. చిన్నచౌకు ఎస్‌ఐ మహ్మద్‌రఫీ, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పాత సామాన్లకు అంటుకున్న నిప్పు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సికెదిన్నె, ఫిబ్రవరి 10: చింతకొమ్మదిన్నె మండలం మూలవంక వద్దగల పాత సామాన్ల గోడౌన్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంపై శ్రమించి రెండు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకు రావడం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే మూలవంక వద్దగల వంకలో గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన గడ్డికి మంట పెట్టడంతో అది అంటుకుంటూ వచ్చి మధ్యాహ్న సమయంలో పాత సామాన్లు గోడౌన్ వెనుకవైపు మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదాన్ని ఎవరు గుర్తించలేకపోయారన్నారు. దట్టమైన పొగ అలుముకోవడంతో చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

● *1500 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం*



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ, నాటుసారా ఊటను పడేస్తున్న పోలీసులు

సంబేపల్లె, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం డీసీ వడ్డెపల్లెకు చెందిన రఘునాథ అనే వ్యక్తి వద్ద 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా శెట్టిపల్లెలో తనిఖీలు నిర్వహిస్తుండగా 180 మిల్లీలీటర్ల 20 బాటిళ్లను అమ్ముతుండగా పట్టుకొని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీసీ వడ్డెపల్లె సమీపంలో నాటుసారా తయారీ కేంద్రంపై పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారీ కోసం డ్రమ్ముల్లో ఉంచిన 1500 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మద్యం అమ్మకాలు నాటుసారా తయారీ వంటి కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

● *నగదు స్వాధీనం చేసుకున్న సీఐ యుగంధర్*


వివరాలు తెలుపుతున్న సీఐ, ఎస్‌ఐ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని సిద్దవటం రోడ్డు సమీపంలో ఉన్న బియ్యం దుకాణంలో నగదు చోరీ జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. బద్వేలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా బద్వేలు సీఐ యుగంధర్ మాట్లాడుతూ పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున బియ్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.2.40 లక్షలు చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. కాగా ఇందులో నిందితుడు గాలిపోతు రవిని శనివారం ఎన్జీవో కాలనీలోని టీస్టాల్ వెనుక వైపు అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న రూ.2.40 లక్షలు నగదు, మరో కేసులో 11 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని సీఐ యుగందర్ తెలిపారు. గతంలో కూడా ఇతను దొంగతనం కేసులో నిందితుడిగా పట్టుబడ్డాడన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వీధుల్లో సంచరిస్తున్నప్పుడు పోలీసు వారికి తెలపాలన్నారు. అంతేకాకుండా ఎవరైనా ఊర్లకు వెళ్లే సమయంలో ఇంట్లో బంగారు వస్తువులు, నగదు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి ముందు ద్విచక్ర వాహనాలకు లాక్ వేసుకుని వాహనాలు భద్రపరచుకోవాలన్నారు. వీలైనంత త్వరగా వీధిచివర, వార్డుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

అధిక వడ్డీంపులు

● *రుణాలు ఇచ్చేటపుడు చెప్పింది 9.9 శాతం* ● *వడ్డీ వసూలు చేసేటపుడు 12.9 శాతం*

● *ఇది డీసీసీ బ్యాంకు తీరు* ● *ఇదెక్కడి న్యాయమని గగ్గోలు పెడుతున్న రైతులు*


12.9 శాతం వడ్డీతో బ్యాంకు అధికారులు రైతుకు అందించిన డిమాండ్ నోటీసు

పులివెందుల, ఫిబ్రవరి 10: అసలే కరువు కాటకాలు.. సాగుచేసిన పంటలన్నీ వర్షాభావ పరిస్థితులతో నిలువునా ఎండిపోయి... సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని దయనీయ స్థితిలో జిల్లా రైతాంగం ఉంది. కానీ డీసీసీ బ్యాంకు మాత్రం అధిక వడ్డీలతో రైతుల నడ్డి విరుస్తోంది. బ్యాంకు రైతులకు రుణాలు ఇచ్చే సమయంలో 9.9శాతం వడ్డీ అని చెప్పి ఇచ్చింది. వసూలు చేసేటపుడు మాత్రం 12.9శాతం వడ్డీతో వసూలు చేస్తోంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వివరాలు ఇలా.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మూడు నాలుగు సంవత్సరాలుగా ఎస్‌టీ (షార్ట్ టర్మ్), అదర్స్ పేరుతో పెద్దఎత్తున రైతులకు రుణాలు మంజూరు చేసింది. ఈ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు సిద్ధమైన సమయంలో మొదట్లో రైతులు రుణాలు తీసుకునేందుకు సుముఖత చూపలేదు. దీంతో ఫ్లెక్సీలు కట్టి, కరపత్రాలు పంచి 9.9శాతంతో రుణాలు ఇస్తామని బాహాటంగా పెద్దఎత్తున ప్రచారం చేసింది. అనంతరం పలువురు రైతులు రుణాలు తీసుకున్నారు.

గత ఏడాది 11.9 శాతం అన్నారు

గత ఏడాది రుణాల వసూలు సమయంలో వడ్డీ 9.9శాతం బదులు 11.9శాతం వసూలుకు రంగం సిద్ధం చేసింది. ఆ సమయంలో రైతుల నుంచి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో దీంతో బ్యాంకు ఒకడుగు వెనక్కి తగ్గి 9.9శాతం వడ్డీతోని మాత్రమే రైతులనుంచి వసూలు చేసింది.

ఈ ఏడాది 12.9 శాతం చేశారు

ఈ ఏడాది 12.9శాతంతో వడ్డీ వసూలు చేయాలని జిల్లా కేంద్రం నుంచి ఆయా బ్యాంకులకు ఆదేశాలు అందాయి. ఆ మేరకు రైతుల నుంచి ఆయా బ్యాంకులు డిమాండ్ నోటీసులు అందించారు. ఇప్పటికే పలు బ్రాంచుల్లో రైతుల నుంచి 12.9శాతం వడ్డీ వసూలు చేశారు. గడువు తీరితే మరింత వడ్డీ పెరుగుతుందని రైతులు భయపడుతున్నారు. దీనికారణంగా గడువులోపే అధిక వడ్డీ చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. కొందరు రైతులు మాత్రం దీనిపై ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు.

కరువున్నా కనికరం లేదు

డీసీసీ బ్యాంకు ఎస్‌టీ, అదర్స్ పేరుతో రైతులకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎరకాలకు మార్కెట్ కంటే రెండింతలు ఎక్కువగా రుణాలు మంజూరు చేసింది. ఒక్కో రైతు కనీసం రూ.5లక్షల నుంచి రూ.40లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. జిల్లాలో వందలకోట్ల రూపాయలు రైతులు రుణాలు తీసుకున్నారు. ఈ ఏడాది కరువు కారణంగా వడ్డీ చెల్లించడమే కష్టమని, ఇక రుణాలు ఎటూ చెల్లించలేరనే ఉద్దేశంతో కావాలనే 12.9శాతం వడ్డీ వసూలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. చెప్పిన మేరకు కాకుండా 3శాతం అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. జిల్లాలో రైతులు తీసుకున్న రుణాలు 500 కోట్లు అనుకుంటే.. దీనికి వీరి నుంచి అదనంగా వసూలు చేస్తున్న మొత్తం రూ.15కోట్లు. కరువు కాలంలో రైతులకు ఇది భారమే. 12.9శాతం వడ్డీ వసూలు చేస్తామని ముందే చెప్పిఉంటే ఈ రుణాలను తాము తీసుకునే వాళ్లమే కాదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది అటు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం కరువు జిల్లాగా ప్రకటించకపోవడంతో పరిహారం అందేది అనుమానమే. ఒకవైపు కంటికెదురుగా కరువు కనిపిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం.. మరోవైపు ఇదే కరువును అదనుగా తీసుకుని డీసీసీ బ్యాంకు వారు అధిక వడ్డీ భారం మోపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరియతల్లి కరుణించే కల్పవల్లి

● నవదిన ప్రార్థనల్లో డీన్ ఫాదర్ ప్రసాదరావు ● విద్యుద్దీపాల కాంతుల్లో లూర్దుమాత ఊరేగింపు


వీధుల్లో మరియతల్లి ఊరేగింపు


విద్యుద్దీపకాంతుల్లో మేరిమాత చర్చి

కడప (కల్చరల్), ఫిబ్రవరి 10 : విశ్వాసులకు మరియతల్లి కరుణించే కల్పవల్లిగా ఆదరిస్తుందని ఫాదర్ డీఎస్ ఎండీ ప్రసాదరావు అన్నారు. మరియాపురం లూర్దుమాత నవదిన ప్రార్థనల్లో భాగంగా శనివారం స్థానిక మరియాపురం పాత చర్చి ఆవరణంలో ప్రసాదరావు ప్రసంగించారు. ఆపదలో ఉన్న విశ్వాసుల బాధలను ఆలకించి వారి కష్టాలను తన కష్టాలుగా ఎంచుకుని బాధలను మటుమాయం చేయగల శక్తి మరియతల్లికే ఉందని అన్నారు. లూర్దుమాత వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం నగర సంధ్య సర్కిల్ సమీపంలో గల డాన్‌బోస్కో ఐటీఐ చర్చి నుంచి పురవీధుల్లో లూర్దుమాత తేరు ప్రదర్శన జరిగింది.

ఆ మేరకు రంగురంగుల విద్యుద్దీపాల కాంతుల మధ్య కోటిరెడ్డిసర్కిల్, సీఎస్‌ఐ చర్చి, ఎన్టీఆర్ సర్కిల్, వన్‌టౌన్, రామక్రిష్ణ జూనియర్ కాలేజీ మరియాపురం ప్రధాన దారి మీదుగా మరియాపురం పాత బ్రిడ్జి వద్దకు ఊరేగింపుగా చేరుకుంది. కార్యక్రమంలో వందలాది మంది విశ్వాసులు తిరుణాల కమిటీ సభ్యులు, సమిష్టి దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు.

జనసేన ఫ్లెక్సీల చించివేత

పోలీస్‌స్టేషన్ ఎదుట జనసేన, టీడీపీ నేతల నిరసన


పెనగలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

పెనగలూరు, ఫిబ్రవరి 10 : మండలంలో ఏర్పాటు చేసిన జనసేన ఫ్లెక్సీల చించివేతకు నిరసనగా శనివారం జనసేన, టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. రెండు రోజుల నుంచి జనసేన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసీపీకి చెందిన కార్యకర్త చించివేస్తున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని జనసేన, టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. శుక్రవారం తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫ్లెక్సీలు చించిన వైసీపీ కార్యకర్తను అదుపులోకి తీసుకుని వెంటనే ఎందుకు వదిలేశారని పెనగలూరు ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో జనసేన, టీడీపీ నాయకులు భారీగా స్టేషన్ లోపలికి చొచ్చుకు రావడంతో ఒకానొక దశలో పరిస్థితి అదుపు తప్పింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని ఎస్‌ఐ తెలిపినప్పటికీ వారు శాంతించలేదు. ఫ్లెక్సీలను తానే చించేశానని, మళ్లీ అదే పనిచేస్తానని ఏం చేసుకుంటారో చేసుకోండి అని జనసేన నాయకులకు ఫోన్ చేయడమే కాకుండా వాట్సప్ గ్రూపులలో తీవ్రపదజాలంతో మెసేజ్‌లు పెడుతున్నాడని ఈ సందర్భంగా వారు ఎస్‌ఐకి తెలిపారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్టేషన్ బయటకు వచ్చి స్టేషన్ ఎదురుగా టెంట్ వేసి ధర్నా చేశారు. 2 గంటల తర్వాత డీఎస్పీ ఫోన్ చేసి వారికి సర్దిచెప్పడంతో ధర్నాను విరమించారు. అనంతరం విలేకర్లతో జనసేన నాయకుడు జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ జనసేన ఫ్లెక్సీలు మొదటిసారి చించివేసినప్పుడు ఎస్‌ఐకి తెలిపామని, రెండోసారి వేసిన ఫ్లెక్సీలను కూడా చించివేశారన్నారు. దానిపైన కూడా తెలిపినప్పటికీ నిందితుడు అధికార పార్టీకి చెందిన కార్యకర్త కావడం వల్ల పోలీసులు కేసు నమోదు చేయడం లేదని తెలిపారు. ఇప్పటికైనా దీనికి బాధ్యుడైన వైసీపీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ కన్వీనర్, కో-కన్వీనర్లు జోగినేని మణి, పగడాల వెంకటేష్, మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ కుప్పాల జ్యోతి, టీడీపీ మాజీ శాప్ డైరెక్టర్ జయచంద్ర, మామిళ్ల రామయ్య, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర, పార్లమెంటు నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి రాంప్రసాద్ నాయుడు, నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి ధనయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో బీటెక్ రవి పుట్టినరోజు వేడుకలు

బండి రవికుమార్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం


వేంపల్లెలో బీటెక్ రవి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

వేంపల్లె, ఫిబ్రవరి 10: మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి జన్మదిన వేడుకలను వేంపల్లెలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ నిమ్మకాయల దర్బార్‌బాష ఆధ్వర్యంలో స్థానిక నాలుగురోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మండల అధ్యక్షుడు మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, ఎస్‌బి జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి ఆధ్వర్యంలో అనాథ శరణాలయంలో అన్నదానం చేశారు. స్థానిక క్రిస్టియన్ కాలనీలో బండి రవికుమార్ కుటుంబానికి బీటెక్ రవి లక్ష రూపాయల ఆర్థికసాయం చేశారు. ఆటోడ్రైవర్‌గా పనిచేసే రవి ఆర్థిక సమస్యలతో మృతి చెందడంతో కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం లక్ష రూపాయల ఆర్థికసాయం అందించినట్లు మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు.

పకడ్బందీగా నవోదయ ప్రవేశ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 10: మదనపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. శనివారం పట్టణంలో జడ్పీహైస్కూల్లోని మూడు సెంటర్లలో 9వ తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహించగా ఆర్డీవో హరిప్రసాద్ ఈ మూడు సెంటర్లను విజిట్ చేసి పరీక్ష నిర్వహిస్తున్న తీరుతెన్నులు పరిశీలించారు. మూడు సెంటర్లకు కలిపి మొత్తం 857 మంది విద్యార్థులకు కేటాయించగా, 591 మంది హాజరయ్యారు. అలాగే జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు గాను 678 మంది పరీక్షకు హాజరు కావాల్సి వుండగా 494 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు, ఎంఈవో ప్రభాకర్ రెడ్డి, జడ్పీ హెచ్‌ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది విధుల బహిష్కరణ


విధులు బహిష్కరించిన రైల్వే ఇంజనీరింగ్ ఉద్యోగులు

నందలూరు, ఫిబ్రవరి10 : నందలూరు రైల్వే కేంద్రంలో శనివారం ఉదయం స్థానిక రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది విధులు బహిష్కరించారు. స్థానిక రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద రైల్వే ట్రాక్‌మన్ రాహుల్ ప్రసాద్, జీఆర్‌పీ కానిస్టేబుల్ నాగార్జున మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో నాగార్జున, రాహుల్ ప్రసాద్‌పై దాడి చేయడంతో గొడవ పెద్దదైంది. బాధిత కార్మికుడికి మద్దతుగా రైల్వే ఇంజనీరింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. రైల్వే కార్మిక నేతలు, పీడబ్ల్యూఐ సురేష్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సుభాన్ ఇద్దరికీ సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ర్యాలీ

పీలేరు, ఫిబ్రవరి 10: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పీలేరు ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత, ప్రయాణంలో పాటించాల్సిన నియమాలను తెలిపే ప్లకార్డులు చేతబూని స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి నాలుగు రోడ్ల కూడలి, పంచాయతీ కార్యాలయం వరకు వారు ర్యాలీ చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరాలని వారు వాహనదారులు, డ్రైవర్లకూ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో మహిళ అరెస్టు

గుర్రంకొండ, ఫిబ్రవరి 10: అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ గామిరెడ్డిగారిపల్లెకు చెందిన లక్షుమ్మ సారా విక్రయిస్తుండడంతో పోలీసులు పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గంగమ్మ ఆలయ పాలక మండలికి దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 10: అనంతపురం గంగమ్మ ఆలయ ధర్మకర్తల పాలక మండలి సభ్యత్వానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ రవీంద్రరాజు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాదు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కర్నూలులోని దేవాదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు గంగమ్మ పార్వేట ఉత్సవం

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 10: అనంతపురం గంగమ్మ ఆలయంలో ఆదివారం పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు. చెల్లు వంశీయులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, బోనాలు, బలిపిల్లను సమర్పిస్తారు. అనంతరం చుట్టు గ్రా మాల ప్రజలు పూజలు చేస్తారు. పార్వేటు నుంచి ప్రతి ఆదివారం అమ్మవారు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శమిస్తారు.

యువకుల రక్తదానం


రక్తదాన శిబిరంలో ఎస్ఐ హుస్సేన్

సుండుపల్లె, ఫిబ్రవరి10: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లను స్మరించుకుంటూ శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు మండల కేంద్రంలోని పవర్ జిమ్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 28 మంది యువకులు రక్తదానం చేశారని షేక్. హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ అహ్మద్, మనోహర్, దీపా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నేతల మంతనాలు

రాజంపేట, ఫిబ్రవరి10 : పట్టణంలోని ఆకులవీధికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రాఘవులు, ఆయన కుమారులు రమణ, భువనగిరిపల్లె నాయకులు టైల్స్ నరసింహ తదితరులతో నియోజకవర్గ జనసేన నాయకుడు అతికారి కృష్ణ శనివారం మంతనాలు జరిపారు. జనసేన పార్టీ తరపున తనకు టికెట్టు ఇచ్చే అవకాశం ఉందని, అందరూ తమకు సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు.

'ఆసరా' ఇస్తామన్నా ఆగని మహిళలు


మీటింగ్ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

నందలూరు, ఫిబ్రవరి 10 : అమ్మ ఆగండి.. మీటింగ్ అయ్యేంత వరకు ఉండండి అని ప్రజా ప్రతినిధులు వేడుకున్న సంఘటన శనివారం మధ్యాహ్నం ప్రభుత్వ కార్యాలయ పరిధిలో నిర్వహించిన ఆసరా మీటింగ్‌లో చోటు చేసుకుంది. పొద్దున మీటింగ్ పెడితే ఇంటికి పోయి అన్నం చేయాలని అంటారు.. మధ్యాహ్నం పెడితే పొద్దుపోతోంది అని అంటారు.. మీరే చెప్పండి తల్లీ ఎప్పుడు మీటింగ్ పెట్టాలో అని దీనంగా ప్రజా ప్రతినిధులు వేడుకుంటున్నా మహిళలు సమావేశం నుండి ఇంటికి వెళ్లడం కొసమెరుపు. ఎంపీడీవో ఆధ్వర్యంలో జరగాల్సిన సమావేశం, ఏపీఎం వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించారు. కచ్చితంగా మీటింగ్ హాజరైతేనే ఆసరా డబ్బులు పడతాయని డ్వాక్రా మహిళలను సమావేశానికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. సమావేశం దాదాపు గంటకు పైగా ఆలస్యం కావడంతో ముఖ్య అతిథులు వచ్చే సమయానికి పలువురు మహిళలు ఇంటి ముఖం పట్టారు. సమావేశం మొదలయ్యాక సైతం విడతలు విడతలుగా వెళ్లిపోవడం గమనించి ప్రజాప్రతినిధులు, మీటింగ్‌లో ఉండాలని మహిళలను వేడుకున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు లక్ష్యాలు సాధించాలి

● డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్


రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10: పట్టణ ఆరోగ్య కేంద్రాలు వందశాతం లక్ష్యాలు సాధించాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో ఎన్‌హెచ్ఎం) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. శనివారం ఆయన ఎస్ఎన్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎస్ఎంవో డాక్టర్ విష్ణుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూపీహెచ్‌సీలలో ఓపీ సేవలందించే వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ప్రతి రోజు టెలీ మెడిసిన్ సేవలు అందించాలని, అర్బన్‌లో వ్యాధి నిరోధక టీకాల ప్రగతి చాలా తక్కువగా జరుగుతోందని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుని లక్ష్యాలు అధిగమించాలని ఆదేశించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీలు ఉన్నాయని, ప్రతినెలా సమావేశాలు నిర్వహించి జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి, వివరాలను యాప్‌లో అప్డేట్ చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. మార్చి 3వ తేదీన నిర్వహించే జాతీయపల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి అరాచకాలపై లోకేష్ 'శంఖారావం'


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 10 : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం తో చేసి వైసీపీ గుండెల్లో వణుకు పుడుతోందని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంఖారావం యాత్ర 50 రోజుల్లో 120 నియోజకవర్గ కేంద్రాలలో అశేష జనవాహిని మధ్య జరుగుతుందన్నారు. ఒక రోజు మూడు నియోజకవర్గాల కేంద్రాల్లో జరిగే విధంగా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. యువగళం పాదయాత్ర దిగ్విజయం కావడంతో వైసీపీ ఎమ్మెల్యేలు అటు ఇటు పరుగులు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు ఎన్ని కుతంత్రాలు చేసినా టీడీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, నీలకంఠయ్య, యువ నాయకుడు తులసి వెంకటేష్ పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: జగన్‌రెడ్డి అరాచకాలపై పూరించిన నినాదమే శంఖారావం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేసేందుకు నారా లోకేశ్‌బాబు శ్రీకారం చుట్టారన్నారు. అభివృద్ధి అంటే మున్సిపాలిటీ కార్యాలయానికి, బస్టాండుకు బోర్డులుపెట్టడం కాదనే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రజలు కష్టపడి సంపాదించినదంతాకరెంటు చార్జీలకు కట్టేసి ఇంట్లో పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఇది వైసీపీ ప్రభుత్వం యొక్క బాదుడు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు సభలకు ప్రజలు తండోపతండాలుగా స్వచ్ఛందంగా వస్తుంటే, ఓర్వలేక తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. శంఖారావం కార్యక్రమంతో వైసీపీ నాయకులకు మళ్లీ వణుకు స్టార్ట్ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్కే హుస్సేన్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యారెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, ఎన్నారై కోఆర్డినేటర్ గుడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీకి మరోసారి అవకాశం కల్పించండి


ప్రచారం చేస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు


పల్లెకు పోదాం కార్యక్రమంలో బీజేపీ నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 10: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజంపేట మండలంలోని పోలి ఎస్టీ కాలనీ, వై.బి.ఎన్.కాలనీ, హనుమాన్ నగర్, రజ కుల కాలనీలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్‌తో కలిసి కరపత్రాలు పంపిణీశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఉచిత బియ్యం, పది లక్షలతో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణ, పాపయ్య, కృష్ణారెడ్డి, హనుమంతు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శిబ్యాల గ్రామంలో 'పల్లెకు పోదాం'

రాయచోటిటౌన్: మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి ఆనందగజపతిరాజు ఆధ్వర్యంలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సిద్దా రెడ్డిగారిపల్లె, వైకుంఠరాచపల్లె, నక్కల మొర పల్లెల్లో పర్యటించారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేసి ప్రధాని నరేంద్రమోడీ క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరామరాజు, మనుమాన్‌నాయక్, లక్ష్మీనారాయణ, ధనుంజయరెడ్డి, బుక్కే రెడ్డినాయక్, భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన కళాశాలలపై చర్యలు తీసుకోండి


ఇంటర్ విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10: ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలకు పాల్పడిన కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో ఒక్కో విద్యార్థితో రూ.1500ల నుంచి రూ.2500ల వరకు ఎటువంటి రసీదు ఇవ్వకుండా వసూలు చేశాయని ఆరోపించారు. ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలోని కొంత మంది సిబ్బంది ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో యాజమాన్యాల నుంచి వేలాది రూపాయలు వసూలు చేశారన్నారు.. ఒప్పందం ప్రకారం ఆయా కళాశాలల విద్యార్థులకు అనుకూలంగా మార్కులు వేసేందుకు సిద్ధం చేశారని ఆరోపించారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ సహాయ కార్యదర్శి ప్రసాద్, పట్టణ నాయకులు జస్వంత్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, చాంద్‌బాషా, ఉమర్, సమర, హర్షవర్ధన్, అర్షద్, నవీన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌రెడ్డికి కువైత్ ఎన్నారైల సంఘీబావం

కలికిరి, ఫిబ్రవరి 10: కువైత్‌లోని ప్రవాసీయులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి సంఘీబావం ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో తామంతా పీలేరు నియోజక వర్గంలో ఆయన గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు. పూల షేక్ అన్వర్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కువైత్‌లోని షమీయ గార్డెన్స్‌లో సమావేశమై ఈ మేరకు తమ నిర్ణయాన్ని ప్రకటించారు. కిశోర్‌కుమార్ రెడ్డితో వీడియో లైవ్‌లో మాట్లాడారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 10 : బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో జగ్జీవన్‌రామ్ నలుగురు ప్రధానమంత్రుల మంత్రివర్గంలో పనిచేశారని తెలిపారు.

దళిత మహిళలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10: దళిత మహిళలపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ఎంఆర్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనే యులు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డె య్య, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, దళిత కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పదేళ్లుగా రామా పురం మండలం చిట్లూరు పంచాయతీ పరిధి లోని పాలన్నగారిపల్లె సమీపంలోని ప్రభుత్వ భూమిని దళిత రైతులు సుధామణి, చిన్నం రాములమ్మ సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ భూముల పరిశీలనకు వెళ్లిన రెవెన్యూ సిబ్బంది, తహసీల్దార్ సాక్షిగా ఆయా దళిత మహిళలపై కొందరు దాడి చేయడంతో బాధితురాలు రామాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ నామమాత్రంగా కేసు నమోదు చేశాడన్నారు. ఇప్పటికైనా సాగులో ఉన్న దళిత మహిళలకు పట్టాలు ఇవ్వాలని, దాడికి పాల్పడిన వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు, దాడికి సహకరించిన తహసీల్దార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు కాంగ్రెస్ మహిళా సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు విజయ, ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర జిల్లా కోశాధికారి శంకరయ్య, బాధిత మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఐసీడీఎస్ బలోపేతం


మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10: ఐసీడీఎస్ ప్రైవేటీకరణ యత్నాలను ఐక్యంగా అడ్డుకుందామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10, 11వ తేదీల్లో చేపడుతున్న శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం రాయచోటి పట్టణ పరిధి లోని శివ నర్సింగ్ కళాశాలలో సీఐటీ యూ సీనియర్ నాయకురాలు పీ. బంగారుపాప ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి శిక్షణ తరగతులను ప్రారంభించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు అంగన్వాడీలపైరాజకీయ పార్టీల వైఖరిని వివరించారు. కార్మిక సంక్షేమానికి సంబంధించిన 44 చట్టాలను 4 చట్టాలుగా మార్చి కార్పొరేట్లకు కట్టబెట్టే యోచనలో ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, శ్రీలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా మురుగు కాలువ పనులు

గాలివీడు, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని పక్కీరారెడ్డిగారిపల్లె పశువుల సంత సమీపంలో గాలివీడు- కదిరి ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. రోడ్లు శుభ్రం చేయడంతో పాటు మురుగునీరు నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

శ్మశాన స్థలం కబ్జా యత్నం అడ్డగింత


స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులతో వాదిస్తున్న గ్రామస్తులు.

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 10: మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ పరిధిలోని ముష్టేరు వద్ద ఉన్న శ్మశానానికి వెళ్లే దారిని సమీపంలోని స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు కబ్జా చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ స్విమింగ్ పూల్‌కు వెళ్లడానికి వేరే మార్గం ఉన్నా, నిర్వాహకులు ఈ దారి ఏర్పాటు చేయడం సరి కాదన్నారు. ఈ దారి కేవలం శ్మశానానికి వెళ్లే మార్గంగా గ్రామస్తులు ఉపయోగిస్తున్నారన్నారు. సమాచారం తెలుసు కున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని పనులను ఆపివేశారు. శ్మశాన స్థలం ఏటి పోరంబోకు కావడంతో గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఈ స్థలంపై రోడ్డు నిర్మిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, రవిచంద్ర రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనిల్, శ్రీనివాసులు రెడ్డి, గజ్జల సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 10: ఈ నెల 16న ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘం, ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షుడు పండు గోల మణి, మారుబోయిన జయరామయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ. టీడీపీ, జనసేన, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే ఈ బంద్‌లో గ్రామీణులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు రేవూరి శంకరయ్య, కార్యదర్శి చలంపాటి నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హజమాబి తదితరులు పాల్గొన్నారు.

'అందరి మాట ఒకటే.. టీడీపీ విజయం తథ్యం'


తిమ్మిశెట్టిపల్లిలో ప్రచారం చేస్తున్న రేవతి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 10: నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి మాట ఒకటే.. టీడీపీ విజయం తథ్యమని అని రైల్వేకోడూరు నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. శనివారం మండలంలోని తిమ్మిశెట్టి పల్లి, అనంతరాజుపేట, రాఘవరాజు పురం పంచాయతీ, అరుంధతివాడ, హరిజనవాడ, తదితర గ్రామాల్లో టీడీపీ కార్యకర్త లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు చెప్పిన ఉచిత హామీలతో మోసపోయామని, నమ్మి ఓటు వేస్తే ధరలు పెంచి నట్టేట ముంచారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. సుపరిపాలన కోసం మళ్లీ టీడీపీని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మణి, తేనేపల్లి చిన్నా కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మపాలెంలో మహిళలకు చీరలు పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత నాగమునిరెడ్డి

సిద్దవటం, ఫిబ్రవరి 10 : సిద్దవటం మండలం జంగాలపల్లె గ్రామ పంచాయతీ కమ్మపాలెం ఎస్సీ కాలనీలో రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కార్యదర్శి నాగముని రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నేతలుదాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపానాన్ని నిషేధిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కిన జగన్‌మోహన్ రెడ్డి ఈ విషయంపై మహిళలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతిపేదవాడు కడుపునిండా అన్నం తింటాడన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, ఉచిత బస్సు ప్రయాణంకూడా కల్పిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమన్నారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. ఈ కార్యక్రమంలో బజాజ్ షోరూం అధినేత అయ్యప్పనాయుడు తెలుగు యువత కార్యదర్శి నాగ భూషణం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభయ క్షేత్రంలో అన్నదానం


అభయక్షేత్రంలో అన్నదానం చేస్తున్న అనుంపల్లి యువత

చిట్వేలి, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు భారతరత్న, సినీ నటుడు కొణిదెల చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డులు ప్రకటించిన సందర్భంగా మండల పరిధిలోని అనుంపల్లికి చెందిన గుత్తి జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం అనుంపల్లి యువత రేణిగుంట అభయక్షేత్రంలో అనాథ పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి ఖ్యాతిని తెరపైన చూపించడంలోనూ భారతదేశంలో తెలుగోడి గొప్పతనాన్ని తెలియజేయడం లోనూ ఇద్దరి పాత్ర ఎంత ప్రాముఖ్యమైనదని వారన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటరమణ, మాదినేని బాల, పసుపులేటి తేజ, గుత్తి మురళి, మాదినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


గట్టుమీదపల్లి పోలింగ్ బూత్‌లో ఆర్వో లీలారాణి

చిట్వేలి, ఫిబ్రవరి 10: పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆర్వో లీలారాణి సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం మండలం లోని తిమ్మయ్యగారి పల్లె, చిట్వేలి, గట్టు మీదపల్లె, రాజుకుంట, అనంపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దొంగ ఓట్ల విషయంలో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శేషంరాజు, బీఎల్‌వోలు, వీఆర్వోలు వీఆర్యేలు పాల్గొన్నారు.

జయాపజయాలను సమానంగా స్వీకరించాలి


మదర్ థెరిస్సా చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్ఐ

నందలూరు, ఫిబ్రవరి 10 : క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరించాలని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ సూచించారు. శనివారం అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్వర్ణాంధ్ర సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాజంపేట పార్లమెంటు స్థాయిలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ముం దుగా మదర్ థెరిస్సా చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్, విశ్రాంత లైన్‌మన్ ఆంధ్రయ్య, సీనియర్ క్రీడాకారులు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ఉమ్మడిశెట్టి సుధాకర్, పోలీసులు దర్బార్‌బాషా, దిలీప్ కుమార్, స్కౌట్ సభ్యులు, వివిధ పాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారు.

హోటల్ యాజమాన్యంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

చిన్నమండెం, ఫిబ్రవరి 10: ఎస్సీ, ఎస్టీలపై వివక్ష ప్రదర్శిస్తున్న మండలంలోని టీ. చాకిబండ హోటల్ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ హోటల్‌లో రెండు గ్లాసుల పద్ధతే కాకుండా, అరచేతుల్లో టిఫిన్ వడ్డించి, దళితుల నోట్లో నేరుగా నీళ్లు వేస్తూ అవమానిస్తున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి హోటల్ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి వారి హోటల్స్ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, వెంకట సుబ్బమ్మ, బాధితులు పాల్గొన్నారు.

మరో అయోధ్యలా పేటమిట్ట

తీర్చిదిద్దుతామన్న గల్లా రామచంద్ర నాయుడు



పూతలపట్టు, ఫిబ్రవరి 10: కోట్లు సంపాదించినా.. జన్మనిచ్చిన ఊరిని మరువరాదు. సొంతూరికి ఏం చేశామన్న ఆలోచన అందరిలోనూ రావాలి. నా స్వగ్రామం 'పేటమిట్టను మరో అయోధ్యలా తీర్చిదిద్దడమే ధ్యేయం' అని అమరరాజా గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు అన్నారు. శనివారం ఆయన పూతలపట్టు మండలం పేటమిట్టలో నిర్మిస్తున్న రామాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సంప్రదాయాలను పునరుద్ధరించడమేగాక ప్రజలంతా కలసిమెలసి ఉండాలన్న ఉద్దేశంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'గ్రామస్తుల సహకారంతో 97 సెంట్ల భూమిని కొనుగోలు చేసి ఇక్కడ తొలుత విరూపాక్షమ్మ గుడిని నిర్మించాం. 2019 జనవరి 20వ తేదీన సొంత నిధులతో పాటు భక్తులు అందజేసిన విరాళాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి కొలువై ఉండేలా ప్రధాన ఆలయాన్ని నిర్మిస్తున్నాం. దీనికి ఓవైపు కృష్ణ మందిరం, మరోవైపు విఘ్నేశ్వర ఆలయం ఉంటాయి. గ్రామమంతా ప్రతిధ్వనించేలా భారీ గంటలు ఏర్పాటు చేస్తున్నాం. ఆలయ సముదాయంలో సమావేశాల నిర్వహణకు మినీ ఓపెన్ ఆడిటోరియం, సామూహిక కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాలు, చిన్నపిల్లల కోసం పార్కు ఉంటాయి' అని రామచంద్ర నాయుడు వివరించారు. ఇక ఆలయ పరిసరాల గుండా ప్రవహించే తేనేపల్లి చెరువు కాలువపై 160 మీటర్ల పొడవున కల్వర్టును నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. దీన్ని అమరరాజా గ్రూపు సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మించారని తెలిపారు.

రేపటినుంచి కుంభాభిషేక మహోత్సవాలు

కోదండరామస్వామి ఆలయ సముదాయానికి సోమవారం నుంచి నాలుగు రోజులపాటు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని రామచంద్ర నాయుడు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమరరాజా సంస్థలు పక్క రాష్ట్రాలకు వెళ్లడంపై, కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నోటీసులపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఎటువంటి నోటీసులు ఇచ్చినా, తాము ఏ తప్పూ చేయలేదనే దృక్పథంతో ధైర్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సంస్థలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. తమ సంస్థల ఏర్పాటుతో పేటమిట్టకు ఇప్పటికే ప్రపంచంలోనే గుర్తింపు వచ్చిందన్నారు.సర్పంచ్ గల్లా రాధాకృష్ణ , పారిశ్రామికవేత్త గల్లా రాజశేఖర్ , పీఆర్వో లు బాబ్జీ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.31 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.31 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 62,593 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 18,517 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



జయం రవి

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, పుదుచ్చేరి ప్రభుత్వ విప్ ఆర్ముగం, తమిళ సినీనటుడు జయం రవి, ఎమ్మెల్సీ ఏసు రత్నం ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10,00,116 విరాళం



ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రామ్‌కు డీడీని అందజేస్తున్న దాతలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 10 : స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరులో స్థిరపడిన గుంతకల్‌కు చెందిన రాచూరు వెంకట కిరణ్ ఆయన కుటుంబ సభ్యులు రూ.10,00,116(పది లక్షల నూట పదహార్లు) విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు డీడీని శనివారం స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రామ్‌ను కలిసి అందజేశారు. పేదల ఆరోగ్యానికి చేయూతనందించేందుకు ముందుకు వచ్చిన వెంకటకిరణ్, ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ వరుణ్‌తేజ పాల్గొన్నారు.

నేత్రదానం



సాయిరాం (ఫైల్ ఫొటో)

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 10: తిరుపతి జిల్లాలోని వెంకటగిరి మండలం యల్లంపల్లికి చెందిన సీహెచ్ సాయిరాం(33) కొంతకాలంగా అనారోగ్యంతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం ప్రయోజనాలను వివరించడంతో వారు అంగీకరించారు. వెంటనే సాయిరాం కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని ఐబ్యాంక్‌కు తరలించారు. యువకుడి కుటుంబీకులను రుయా అధికారులు అభినందించారు.

భార్యను చంపుతానంటూ మద్యం మత్తులో వీరంగం

● దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

పలమనేరు, ఫిబ్రవరి 10: భార్యను చంపుతానంటూ మద్యం మత్తులో కత్తితో వీరంగం చేసిన ఓ వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. పలమనేరు మండలం కరిడిమడుగులో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కరిడిమడుగుకు చెందిన అమృతను నిమ్మనపల్లె మండలానికి చెందిన ఉమామహేశ్వరరెడ్డితో వివాహం జరిపించారు. మద్యానికి బానిసైన అతడు నాలుగురోజుల క్రితం మద్యం కోసం తాళిబొట్టు ఇవ్వలేదని భార్యతో గొడవపడి, కత్తితో నరికి తీవ్రంగా గాయపరిచాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు ఉమామహేశ్వరరెడ్డిపై నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమృతకు చికిత్స చేయించి, పుట్టింటికి తీసుకొచ్చారు. పుట్టింట్లో ఉన్న భార్యను మళ్లీ చంపుతానంటూ శనివారం రాత్రి మద్యంతాగి కత్తి పట్టుకుని గ్రామంలో వీరంగం చేయడంతో గ్రామస్తులు అతడిని విద్యుత్ స్తంభానికి కట్టి దేహశుద్ధిచేశారు.

నడక మార్గంలో పాము

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడక మార్గంలో శనివారం ఓ పాము పట్టుబడింది. అలిపిరి మార్గంలోని మోకాళ్లమిట్ట వద్ద అరడుగుల పొడవు కలిగిన జెర్రిపోతు మెట్లపైకి వచ్చింది. గుర్తించిన భక్తులు, దుకాణదారులు పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఏడవ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 22 నుంచి 25 సర్గల వరకు ఉన్న 155 శ్లోకాలు, యోగవాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 180 శ్లోకాలను ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేస్తారు.

ముగిసిన సంస్కృత సంభాషణ శిక్షణ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 10: జాతీయ సంస్కృత వర్సిటీలో ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించిన సంస్కృతసంభాషణ శిక్షణ శనివారంతో ముగిసింది. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ నగరవ్యాప్తంగాసంస్కృతశిబిరాలు నిర్వహించి, సంస్కృతభాషను ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. ఎం.నరసింహాచార్యులు, ప్రొఫెసర్ కాదంబినీ, శేఖర్‌రెడ్డి, అలోక్‌మండల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక ధరకు మద్యం విక్రయం

● రూ.10 అదనంగా వసూలు చేసిన సేల్స్‌మాన్

● ఎస్ఈబీ అధికారులు కొట్టారంటూ పెట్రోలు పోసుకున్న సూపర్‌వైజర్

● చేయిచేసుకోలేదన్న ఎస్ఈబీ అధికారులు



ఎస్ఈబీ స్టేషన్ వద్ద మద్యం దుకాణాల సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10: తిరుపతి నగరంలోని ఓ మద్యం దుకాణంలో సిబ్బంది అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తుండటాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సదరు సేల్స్‌మాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఆధ్వర్యంలోని విజిలెన్స్ అధికారులు శనివారం నగరంలోని పలు మద్యం దుకాణాల్లో రహస్య తనిఖీలు చేపట్టారు. అన్నమయ్య కూడలిలోని మద్యం దుకాణం నెంబరు 10025లో మద్యాన్ని కొనుగోలు చేశారు. సేల్స్‌మాన్ గౌతం బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేశారు. దీంతో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకుని తిరుపతి అర్బన్ ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదుకు సిఫారసు చేశారు. ఈలోపు అతనికి మద్దతుగా పలు మద్యం దుకాణాల సిబ్బంది ఎస్ఈబీ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది అతనిపై చేయి చేసుకున్నారని, కేసు నమోదు చేయకుండా వదిలేయాలని అర్బన్ ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డిని కోరారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విషయం కొలిక్కి రాకపోవడంతో దుకాణ సూపర్‌వైజర్ జి.చరణ్‌కుమార్ ఒంటిపై పెట్రోలు పోసుకున్నారు. గౌతంపై కేసు నమోదు చేసినా, అతని ఉద్యోగానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ సుబ్బారెడ్డి వారితో చర్చించి, ఉద్యోగానికి భరోసా ఇవ్వడంతో గౌతం, చరణ్‌కుమార్‌తో కలిసి సిబ్బంది వెనుదిరిగారు. కాగా, మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, సిబ్బందిని అదుపులోకి తీసుకునే అధికారం తమకు లేదని ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డి ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఏసీ విజిలెన్స్ బృందం తనిఖీలు చేసి గౌతంను తమ స్టేషన్‌కు తీసుకొచ్చారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే బాధ్యత తమదేనని అన్నారు. నిందితుడిని తాము కొట్టామని చెప్పడం అబద్ధమని అన్నారు.





నిందితుడు గౌతం - ఒంటిపై పెట్రోలు పోసుకున్న చరణ్‌కుమార్

ముగిసిన పురందరదాసు ఆరాధన మహోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు ఆస్థాన మండపంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రంజని కళాకారులతో సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం : కలెక్టరు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు

శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 10: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టరు సగిలి షన్మోహన్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు తెలిపారు. శనివారం ఆయన శాంతిపురం మండల సచివాలయంలో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. 2024 ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అధికార యంత్రాంగం సిద్ధమవ్వాలని, ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల ఏర్పాటు, భద్రత, ఫొటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాల్లో ప్రాథమిక శిక్షణ అందించామని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని కనీస వసతుల ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టరు ఆయనకు వివరించారు. అదేవిధంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. భద్రత ఏర్పాట్ల విషయంలో ఎస్పీతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని ఆయన వివరించారు.

హోటల్ గదిలో యువకుడి ఆత్మహత్యాయత్నం

పలమనేరు, ఫిబ్రవరి 10: ప్రేమించిన యువతి తిరస్కరించడంతో ఓ యువకుడు గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉదంతం పలమనేరులో శనివారం జరిగింది. పట్టణ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్న గదిని పూతలపట్టు మండలానికి చెందిన జయప్రకాష్ అనే యువకుడు నాలుగురోజుల క్రితం అద్దెకు తీసుకొన్నాడు. శనివారం మధ్యాహ్నం గదిలో జయప్రకాష్ రక్తపు మడుగులో పడివుండగా హోటల్ సిబ్బంది చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జయప్రకాష్‌ను పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం వేలూరు సీఎంసీకి తరలించారు. పలమనేరు పోలీసులు విచారిస్తున్నారు.

అద్భుతం... సృజనాత్మక దృక్పథం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: గురువుల నేతృత్వంలో విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరిసింది. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర హైస్కూల్లో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జిల్లాస్థాయి ఇన్స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనలో పలువురు విద్యార్థులు తమ ఆవిష్కరణలతో ప్రముఖుల మెప్పు పొందారు.దైనందిన జీవనంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే సరికొత్త ఆలోచనలకు విద్యార్థులు శ్రీకారం చుట్టారు.ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఈవో శేఖర్,జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ఐఎం పరిశీలకులు మహ్మద్ రయిజ్, దివ్యాన్ష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ తదితరులు

మద్యం సేవిస్తే బండి నడవదంతే



శ్రీకాళహస్తి పట్టణం బాబు అగ్రహారంలోని హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న పవన్ కుమార్. ఉపాధ్యాయురాలు వరలక్ష్మి పర్యవేక్షణలో ఈ ప్రయోగాన్ని ప్రదర్శించాడు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న విషయం తెలిసిందే. వీటిని అరికట్టేందుకు ఆల్కహాల్ సెన్సార్, వాయిస్ సెన్సార్, మైక్రో కంట్రోలర్ పరికరాలతో సర్క్యూట్‌ను రూపొందించారు. వాహనంలోని ఇంజన్‌కు దీన్ని అనుసంధానం చేస్తారు. డ్రైవర్ మద్యం సేవించి సీట్లో కూర్చోగానే నోటి నుంచి వెలువడే వాసన, మాటల శబ్దాల నుంచి ఈ పరికరం మద్యం పరిమాణాన్ని గుర్తిస్తుంది. పరిమితి దాటినట్లు మైక్రో కంట్రోలర్ నిర్ధారణకు వస్తే వెంటనే ఇంజన్ దానంతట అదే ఆగిపోతుంది.డ్రైవర్ మారేవరకు వాహనం కదలదు.

గుండెపోటును ముందుగానే గుర్తిస్తే



బుచ్చినాయుడు కండ్రిగ మండలం సహజ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న కార్తీక్ ఉపాధ్యాయుడు సురేష్ నాయుడు పర్యవేక్షణలో మంచి ప్రయోగాన్ని ప్రదర్శించాడు. ఇటీవల గుండెపోటుతో చాలామంది హఠాన్మరణం చెందుతున్న నేపథ్యంలో హృదయ స్పందనను ముందుగానే పసిగట్టి ఆ వ్యక్తికి అలారం రూపంలో హెచ్చరిక వస్తే వెంటనే వైద్యం పొందవచ్చు కదా అని ఆలోచించాడు. ఎలక్ట్రానిక్ సెన్సార్ ద్వారా గుండెపోటు సంభవించడానికి ముందు శబ్దంతో పాటు హృదయ స్పందనలో తేడాలను డిస్ప్లేలో ఈ పరికరం చూపుతుంది.

రైలు పట్టాలపై విద్యుదుత్పత్తి



రేణిగుంట జడ్పీ హైస్కూల్లో టెన్త్ చదువుతున్న ఈ రవీంద్ర ఉపాధ్యాయుడు నాగరాజు సూచనలతో రైలు పట్టాలపై విద్యుదుత్పత్తి ప్రయోగాన్ని ఆవిష్కరించారు. పట్టాలపై రైలు చక్రాలు దొర్లే సమయంలో మెకానికల్ ఎనర్జీ ఉద్భవిస్తుంది. దీనినే కైనెటిక్ ఎనర్జీ అంటారు. రైలు పట్టాలపై డైనమో సిద్ధాంతం ద్వారా మెకానికల్ ఎనర్జీతో విద్యుదయస్కాంత శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. దానిని ఏసీ కరెంటుగా నిల్వ చేసుకోవడం ద్వారా తిరిగి అవసరాలకు డీసీ కరెంటుగా కన్వర్ట్ చేసుకోవచ్చు. రైలు పట్టాలపై వృథాగా పోతున్న మెకానికల్ శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ఆలోచన ఇది.

కునుకుతో ప్రమాదాలకు చెక్



చంద్రగిరి మండలం ఐతేపల్లి జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న నిహిత టీచరు సురేష్ పర్యవేక్షణలో కునికిపాట్లతో జరిగే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టే ప్రయోగాన్ని ప్రదర్శించింది.కనురెప్పల కదలిక ఆధారంగా పనిచేసే కళ్లజోడును రూపొందించింది.డ్రైవింగులో ఈ కళ్లద్దాలు ధరించి వాహనం నడుపుతున్నప్పుడు కునుకు తీస్తే వెంటనే అద్దాల నుంచి శబ్దంతో హెచ్చరిక వస్తుంది. అలాగే వైబ్రేషన్ రావడంతో డ్రైవరు అప్రమత్తం కావచ్చు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు


పరీక్షకు హాజరైన విద్యార్థులు

మదనపల్లెటౌన్/ అర్బన్, ఫిబ్రవరి 10: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం మదనపల్లెలో ప్రశాంతంగా నిర్వహించారు. 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. శనివారం పట్టణంలో జడ్పీహైస్కూల్లోని మూడు సెంటర్లలో 9వ తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహించగా ఆర్డీవో హరిప్రసాద్ ఈ మూడు సెంటర్లను విజిట్ చేసి పరీక్ష తీరుతెన్నులు పరిశీలించారు. మూడు సెంటర్లకు కలిపి మొత్తం 857 మంది విద్యార్థులకు కేటాయించగా, 591 మంది హాజరయ్యారు. అలాగే జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకుగాను 678 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 494 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ హెచ్‌ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యపై శ్రద్ధవహించాలి

కలకడ, ఫిబ్రవరి 10:రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధవహించాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డిలు సూచించారు. శనివారం మండల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సింగిల్ విండ్ చైర్మన్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పరపతి సహకార సంఘం ఆన్‌లైన్‌కు మారుతున్న దృష్ట్యా సభ్యుల ఈకేవైసీ ప్రక్రియకు అధికారులు సహకరించాలని కోరారు. ఏవో లావణ్య, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి ,ఎంఈవో రామచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

కలికిరి, ఫిబ్రవరి 10: కలికిరి సహకార రూరల్ బ్యాంకు (సింగిల్ విండో)లో రుణాలు తీసుకున్నవారు, డిపాజిట్‌దార్లతో సహా సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని బ్యాంకు అధ్యక్షుడు శ్రీకర్ రెడ్డి, సీఈవో కొండప్ప శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ చేపట్టిన సంస్కరణల్లో భాగంగా సొసైటీ సభ్యుల వివరాలన్నింటినీ కంప్యూటరైజేషన్ చేయడం జరుగుతోందని ఈ ప్రక్రియలో భాగం సభ్యులందరూ ఈ నెల 12వ తేదీ లోగా రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను సొసైటీలో అందజేయాలని కోరారు. సభ్యులందరూ తప్పనిసరిగా సహకరించాల్సిందిగా కోరారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం


గుర్రంకొండలో జరిగిన బీసీ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్రయాదవ్

గుర్రంకొండ, ఫిబ్రవరి 10:తెలుగుదేశం పార్టీ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు తగిన గుర్తింపు వచ్చిందని రాజంపేట పార్లమెంటు టీడీపీ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. శనివారం గుర్రంకొండలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలోనే బీసీలకు రాజకీయ గుర్తింపు కల్పించడంతో పాటు బీసీల సంక్షేమం కోసం వివిధ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాగానే అన్ని కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీసీలు ఆర్థికంగా ఎదగాలంటే తిరిగి టీడీపీ అధికారంలోకి రావాలని కోరారు. అనంతరం బీసీ నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్థన్‌గౌడ్,జగదీష్‌కుమార్, నౌషాద్ అహ్మద్, మురళీ, గుత్తికొండ త్యాగరాజు, జ్ఞానమూర్తి, భాస్కర్, వేణుగోపాల్, వెంకట రమణ, ఆనంద్, సుధాకర్, శేఖర్, ఆదినారాయణ, వెంకటకృష్ణారె డ్డి, హరి, ప్రకాశ్, దేవిక, రెడ్డిశేఖర్, సుబ్బరాజు, రామయ్య పాల్గొన్నారు.

ఎన్నికల్లో తప్పులు చేస్తే ఉద్యోగాలు పోవడం ఖాయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10: ఎన్నికల విధుల్లో తప్పులు చేస్తే ఉద్యోగాలు పోవడం ఖాయమని వాల్మీకిపురం టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఓటర్ల విషయంలో చేర్పులు, మార్పులకు సంబంధించి విధులు నిర్వహిస్తున్న ఈఆర్‌వో, బీఎల్‌వోలు బాధ్యతగా విధులు నిర్వహించాలని లేనిపక్షంలో ఉద్యోగాలు ఊడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, మండల తెలుగు యువత, మైనార్టీ అధ్యక్షుడు చాను, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్ ఆనంద్, సాదిక్, రామకృష్ణ, అబ్బాస్, యూసఫ్ పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను అణగదొక్కేందుకే శంఖారావం


టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన, దౌర్జన్యాలను అణగదొక్కేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రకు 97 నియోజకవర్గాల ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఇప్పుడు శంఖారావం మిగిలిన నియోజకవర్గాల్లో నిర్వహిస్తారన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు చలపతినాయుడు, పట్టణ, మండల అధ్యక్షులు జోలెపాళెం భవానిప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, కత్తి లక్ష్మన్న, కొండ్రెడ్డి, చల్లా నరసింహులు, బావాజాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ పొత్తులకు లోబడే పనిచేస్తాం


ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత రామాంజనేయులు, అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 10: జనసేన-టీడీపీ పొత్తులకు లోబడే పనిచేస్తామని, అధిష్ఠాన నిర్ణయాన్ని శిరసావహిస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనే యులు పేర్కొన్నారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా శనివారం 54వరోజు నీరుగట్టువారిపల్లెలోని మాయాబజార్, గొల్లపల్లెరోడ్డు ఏరియాలలో పర్యటించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో టికెట్ ఎవరికి ఇచ్చినా ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తామనే నినాదంతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నా సేన..నా వంతు రాష్ట్రకమిటీ సభ్యురాలు, పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు జగదీష్, శంకర్ బాబు, చంద్రశేఖర, ఆకుల శంకర్, అశ్వత్‌రాయల్, ధరణికుమార్, సోను, సుప్రీంహర్ష్, యాసిన్, నవాజ్, బహదూర్, చంద్రశేఖర్, పద్మావతి, శేఖర్ పాల్గొన్నారు.

పాడిఆవుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 10: చూలుతో వున్న పాడిఆవులను చివరి మూడుమాసములలో తగు జాగ్రత్తగా చూసుకోవాలని పశుసంవర్థక శాఖ ఏడీ రోహిణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చెరువుముందరపల్లిలో పాడి రైతులకు చూలుతో వున్న పాడి ఆవులను ఎలా చూసుకోవాలని అనే దానిపై వివరించారు. ముఖ్యంగా పాడి ఆవులకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం జబ్బుతో బాధపడుతున్న పాడి ఆవులను పరిశీలించి రైతులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సురేష్, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10: గ్రామీణా ప్రాంతాల్లో శనివారం తహసీల్దార్ రమాదేవి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని బసినికొండ గ్రామంలోని వడ్డిపల్లెలో, కొత్తపల్లె గ్రామంలోని కొత్తపల్లె, కోటావారిపల్లె గ్రామంలో కోటావారిపల్లె పోలింగ్ కేంద్రాలను, అక్కడ కావాల్సిన సౌకర్యాలను తహసీల్దార్ పరిశీలించారు. ఎన్నికల అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

భద్రత పాటిస్తే సురక్షిత గమ్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10: రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరవచ్చని వాల్మీకిపురం సీఐ పులి శేఖర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈసందర్భంగా రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

పీలేరు, ఫిబ్రవరి 10: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పీలేరు ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత, ప్రయాణంలో పాటించాల్సిన నియమాలను తెలిపే ప్లకార్డులు చేతబూని వారు ర్యాలీ చేపట్టారు. కార్మిక సంఘ నాయకులు పీఎస్‌ఎం రాజు, సీవీ రమణ పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న పురస్కారంపై హర్షం

కలికిరి, ఫిబ్రవరి 10: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహా రావుకు భారతరత్న పురస్కారం అందజేయడానికి కేంద్రం నిర్ణయించడంపట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కఠిన నిర్ణయాల ద్వారా పీవీ దేశానికి చేసిన సేవలు ఆలస్యంగానైనా గుర్తించిన కేంద్రానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జనసేనలోకి పలు కుటుంబాలు చేరిక



పీలేరు, ఫిబ్రవరి 10: పీలేరు, కేవీపల్లె మండలాల్లోని 30 వైసీపీ సానుభూతి కుటుంబాలు శనివారం జనసేన పార్టీలో చేరాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కలప రవి వారందరికీ పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పంథా నచ్చి వైసీపీలోని అనేక మంది వచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు. జనసేన నాయకులు మోహనకృష్ణ, గజేంద్ర, గురుమోహన్, నవీన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యం

కలకడ, ఫిబ్రవరి 10:దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే బీజేపీ లక్ష్యమని నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం కలకడలో కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజినేయులు, నవీన్, రెడ్డిప్రసాద్, గోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మదనపల్లెలో పల్లెకు పోదాం కార్యక్రమం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10: గ్రామీణా ప్రాంతాల్లో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వేం ఎల్లె లో బీజేపీ రూరల్ అధ్యక్షుడు పచ్చిపాల వసంతకుమార్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమపథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లి మరోసారీ మోదీని ప్రధానిగా చేయాలని ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పెద్దమండ్యం, ఫిబ్రవరి 10: పెద్దమండ్యం పరిధిలోని బిక్కావాండ్లపల్లికు చెందిన టీడీపీ నాయకుడు రఘునాధను శనివారం రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అ్యక్షుడు సురేంద్రయాదవ్ పరామర్శించారు. గత పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో రఘునాధ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ బిక్కావాండ్లపల్లిలో ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. వెంకటరమణ, బిక్కా మధుకర, రామచంద్ర, సదాశివ, రాజారెడ్డి, శివ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సాయం


టీడీపీ కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శంకర్‌యాదవ్

ములకలచెరువు/బి.కొత్తకోట, ఫిబ్రవరి 10: టీడీపీ కార్యకర్త కుటుంబానికి తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ అండగా నిలిచారు. కార్యకర్త భార్య మృతి చెందడంతో ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి తక్షణ సాయంగా రూ.50వేలు ఆర్థి క సహాయం అందజేశారు. ములకలచెరువుకు చెందిన టీడీపీ కార్యకర్త సోమశే ఖర్ భార్య రమణమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ ములకల చెరువుకు చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు కేవీ రమణ, చెన్నకిష్టా, కేశవులు, నాగరాజుయాదవ్ పాల్గొన్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీలోని బీసీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త నక్కా రాజు ఇటీవల మృతి చెందడంతో శనివారం శంకర్ యాదవ్ అతని నివాసానికి వెళ్లి రాజు భార్యకు రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. అదేవిధంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు దేరంగుల నారాయణను పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి పర్వీన్ తాజ్, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మెన్ శ్రీనాథరెడ్డి, నాయకులు షమీఉల్లా, కనకంటి ప్రసాద్, పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌రెడ్డికి కువైత్ ఎన్నారైల సంఘీభావం

కలికిరి, ఫిబ్రవరి 10: కువైత్ దేశంలోని పలు సంఘాలు, సేవా సంస్థలకు చెందిన పీలేరు నియోజకవర్గ ప్రవాసీయులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి సంఘీభావం ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో తామంతా పీలేరు నియోజకవర్గంలో కిశోర్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు. షూల షేక్ అన్వర్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కువైత్‌లోని షమీయ గార్డెన్స్‌లో సమావేశమై ఈ మేరకు తమ నిర్ణయాన్ని ప్రకటించి కిశోర్‌కుమార్ రెడ్డితో వీడియో లైవ్‌లో మాట్లాడి తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. సమావేశంలో ఏపీ యంగ్ లీడర్స్ ఆర్గనైజేషన్ టీమ్ సభ్యులు, జనం మనం సేవ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.